
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 19 జులై 2024



ఇంటర్ బోర్డు నియమాలు పాటించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



ఇంటర్మీడియట్ బోర్డు నియమాలను ఖచ్చితంగా కళాశాలలు పాటించాలని, ఉపేక్షిస్తే వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్‌రవి అన్నారు. ఈ మేరకు ఆర్‌టిఒకు వినతిపత్రం సమర్పించారు. ఓ వైపు అక్రమ ఫీజు వసూలు చేస్తూ, పిల్లల్ని మానసికంగా ప్రత్యేక తరగతుల పేరిట హింసిస్తున్నారన్నారు. అనుమతి లేకుండా ప్రైవేట్‌గా రెసిడెంట్స్ నడుపుతూ లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ర్యాంకుల పేరిట మానసిక ఒత్తిడి పెడుతున్నారన్నారు. ప్రత్యేక తరగతులంటూ సెలవుల్లేకుండా, ఆదివారాల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వినోద్, తేజ ఉన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ల భారీ బదిలీలు..?

వైసిపికి కొమ్ముగాసిన వారిపై వేటు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి రాగానే కక్షసాధింపు చర్యలు ప్రారంభమయ్యాయి. లక్షల కోట్ల విలువ చేసే భూములను అప్పన్నంగా రిజిస్ట్రేషన్లకు సహకరించిన సబ్‌రిజిస్ట్రార్ల అంతు తేల్చనుంది. ఈ మేరకు ఏ భూములు ఎక్కడ, ఎవరికి రిజిస్ట్రేషన్ చేశారనేది ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం సేకరించింది. తిరుపతి జిల్లాలో బాలాజీ రిజిస్ట్రార్‌తో పాటు 16 సబ్ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. ముఖ్యంగా తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి అర్బన్, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు సబ్ రిజిస్ట్రేషన్ ప్రాంతాల్లో లక్షల ఎకరాలు వైసిపి హయాంలో అన్యాక్రాంతమయ్యాయి. డికెటి, అటవీ, కాల్వ పరంబోకు భూములన్నీ రిజిస్ట్రేషన్ చేసేశారు. బ్యాంకుల్లోనూ పెద్దమొత్తంలో వీటి ఆధారంగా రుణాలను సైతం ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అధికారికంగా ఇచ్చిన రైతు భరోసాలో ఈ భూముల ద్వారా 60 లక్షల కోట్లు ఈ ఐదేళ్లలో వైసిపి నాయకులు రైతు ముసుగులో రైతు భరోసాను దుర్వినియోగం చేశారని నిగ్గు తేలింది. శ్రీకాళహస్తి, తొట్టంబేడు రిజిస్ట్రార్లు అధికార పార్టీకి కొమ్ముగాస్తూ స్థానిక అప్పటి ఎంఎల్ఎలకు అనుకూలంగా రిజిస్ట్రేషన్లు చేశారన్నది ఆధారాలతో సహా ప్రస్తుత నూతన ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేశారు. సత్యవేడులో మహిళా రిజిస్ట్రార్ వైసిపి నాయకులకు అటవీ భూములను సైతం రిజిస్ట్రేషన్ చేసేసినట్లు విచారణలో వెల్లడయ్యింది. తిరుపతి రూరల్, చంద్రగిరిలలోనూ వందలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. వాటిపైనా నూతన ప్రభుత్వం నిఘా ఉంచి వివరాలను సేకరించింది. తిరుపతి రూరల్‌లో చుక్కల భూములు అధికంగా ఉన్నాయి. వివాదాస్పద భూములుగా ఉన్నవాటినీ 2016లో అప్పటి ప్రభుత్వం 20ఎ కింద రిజిస్ట్రేషన్లను నిలిపేసింది. అయితే వేరే సర్వే నంబర్ పెట్టి ఆ చుక్కల భూములను సైతం ఎంఆర్‌పల్లి సమీపంలోని కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ఎంచక్కా జరిగిపోయింది. ఈ నేపథ్యంలో అధికారికంగా సమాచారం తీసుకున్న ప్రభుత్వం వాటిని రద్దు చేసేందుకు కసరత్తు ప్రారంభిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అప్పటి అధికార పార్టీకి వంత పాడిన సబ్ రిజిస్ట్రార్లను పక్కన పెట్టాలని చూస్తోంది. తిరుపతి జిల్లాలో 16మంది సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేయాలని చూస్తోంది. ఈ నెల 7న బదిలీలు ఉంటాయని చర్చ నడిచింది. అయితే 20వ తేదీ నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. విషయం తెలుసుకున్న సబ్ రిజిస్ట్రార్లు తమకు పలుకుబడి ఉన్న వారిచేత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వారికి సహకరించిన సిబ్బందిపైనా వేటు పడే అవకాశం లేకపోలేదు.

వేదాంతపురంలో ఆగని కబ్జాలపర్వం

ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్)

తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామపంచాయతీలో కాల్వ పరంబోకు భూములను వైసీపీ నేతలు కబ్జా చేసి యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేదాంతపురంలోని సర్వేనెంబర్ 214, 208 సర్వే నెంబర్లలోని కాల్వ పరంబోకు స్థలాన్ని వైసీపీ చోటా నాయకులు కబ్జా చేసి రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టారు. ఉదయానికల్లా కరెంటు మీటర్లను బిగించి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేస్తున్నారు. దీనిపై స్థానిక టిడిపి నాయకులు కొంతమంది జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారుల దష్టికి తీసుకెళ్లారు. స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి వైసీపీ నాయకులకు సహకరించడంతో వైసీపీ నేతలు



వేదాంతపురం పంచాయతీలో భూ కబ్జాలను శరవేగంగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే కాసులకు కక్కుర్తి పడి కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే బెదిరిస్తున్నారని వాపోయారు. భూకబ్జాలను అడ్డుకుంటున్నారన్న కోపంతో వైసిపికి చెందిన కొంతమంది మూకలు మద్యం సేవించి రాత్రుల్లో టిడిపి ఏర్పాటు చేసుకున్న బ్యానర్లను సైతం చించివేయడం గమనార్హం. ఇకనైనా ఈ రగడ పెద్దది కాకముందే రెవెన్యూ అధికారులు స్పందించి వేదాంతపురంలో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలను ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కబ్జాలను అడ్డుకున్నాం : వీఆర్వో శ్రీధర్

వేదాంతపురం గ్రామంలో సర్వేనెంబర్ 214 లో స్థలాన్ని దోబీ ఘాటుకు కేటాయించారు. ఆ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకున్నామని గ్రామ రెవెన్యూ అధికారి శ్రీధర్ తెలిపారు. 208, 214, సర్వేనెంబర్లలోని భూముల్లోకి ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని మండల తహసిల్దార్ దష్టికి తీసుకెళ్లామని వివరణ ఇచ్చారు.

త్వరలోనే నామినేటెడ్ 'జాతర'

ఎంఎల్ఎల వద్ద రాయ'బేరాలు'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. దీంతో టిడిపి టిక్కెట్ దక్కనివారు, గత ఐదేళ్లలో పార్టీ జెండా మోసిన వారి నుంచి నామినేటెడ్ పదవుల కోసం ఒత్తిడి మొదలయ్యింది. ఈ నేపథ్యంలో త్వరలోనే నామినేటెడ్ పోస్టులను సిఎం చంద్రబాబునాయుడు భర్తీ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాల వారీగా పార్టీ కోసం పనిచేసిన వారి వివరాలను అధినేత సేకరిస్తున్నారని తెలుస్తోంది. పార్టీ టికెట్ త్యాగం చేసిన వారికి, సీనియర్లకు తొలి ప్రాధాన్యత ఉండనుంది. జిల్లాస్థాయిలో ఉద్యోగుల బదిలీల అనంతరం పోస్టుల పందేరం ఉంటుందని సమాచారం.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. గత ప్రభుత్వ హయాంలో పదవులు పొందిన వారిని రాజీనామాలు చెయ్యాలంటూ ప్రభుత్వ కార్యదర్శి జీవో విడుదల చేశారు.. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కీలక పదవుల్లో ఉన్న వారందరూ రాజీనామాలు చేశారు.. దీంతో ఖాళీ అయిన కార్పొరేషన్లు, ఇతర పదవుల సమాచారాన్ని పార్టీ అధినాయకత్వం ఇటీవల సేకరించింది. దీని ప్రకారం ముఖ్యమైన కార్పొరేషన్లు వందకు పైగా తేలాయట.. వాటితో పాటు సామాజిక వర్గాల వారీగా ఉన్న ఫెడరేషన్లు, జిల్లా స్థాయిలో నీటి సంఘాలు వంటి పదవులను సైతం పరిగణలోకి తీసుకుని వాటిని క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన నేతలకు కట్టబెట్టాలని చంద్రబాబు ఆలోచనగా పార్టీ నేతలు చెబుతున్నారు..


క్యాబినెట్ విస్తరణతో సీనియర్లకు ప్రాధాన్యత ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు.. వారి గెలుపులో కీ రోల్ పోషించిన వారికి కూడా తగిన గుర్తింపు ఇవ్వాలని భావిస్తున్నారట. తిరుమల తిరుపతి దేవస్థానం మొదలుకొని కింది స్థాయిలో చిన్న దేవాలయాల వరకూ పాలక మండళ్ల నియామకానికి కూడా అవకాశం ఉండటంతో ఆయా ఆలయాలతో ప్రత్యేక అనుబంధం ఉన్నవారిని కూడా ఎంపిక చెయ్యాలని జిల్లా మంత్రులకు ఆదేశాలు సైతం జారీ చేశారట.. టీడీపీతో పాటు కూటమి పార్టీలుగా ఉన్న జనసేన, బిజేపీలకూ ప్రాధాన్యత ఇచ్చేలా చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.. అయితే కీలకమైన పదవులను టీడీపీ నేతలకు ఇవ్వాలని కొందరు సీనియర్లు చంద్రబాబు దష్టికి తీసుకెళ్లడంతో ఆ దిశగా ఆయన ఆలోచనలు చేస్తున్నారట.. సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకుని జనసేన, బిజేపీకి నేతలకు తగిన ప్రాధాన్యత ఉంటుందని టీడీపీ ముఖ్యనేతలు చర్చించుకుంటున్నారు.. మొత్తంగా చూసుకుంటే మరో వారం, పదిరోజుల్లో నామినేటెడ్ పదవుల పందారం ప్రారంభం కాబోతుందన్నమాట..

జిల్లాలో ఆలయ ట్రస్టు బోర్డులు, మార్కెట్‌యార్డు చైర్మన్లు, గ్రంథాలయ చైర్మన్లు, కార్పొరేషన్ పదవులతో పాటు యూనివర్సిటీల పాలకమండళ్లు ఏర్పాటు కానున్నాయి. ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్, బోర్డు సభ్యులు, ఎస్వీబీసీ చైర్మన్ పదవులను భర్తీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో బోయకొండ గంగమ్మ, చంద్రగిరి మూలస్థానమ్మ, కుప్పం తిరుపతి గంగమ్మ, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, శ్రీకాళహస్తి ట్రస్టు బోర్డుతో పాటు పలు ఆలయాల్లో కమిటీలను వేయనున్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్, స్మార్ట్‌సిటీ చైర్మన్, తుడ, విద్య, వైద్య కమిటీలను భర్తీ చేయనున్నారు.

ఎస్‌విబిసి చైర్మన్‌గా రాఘవేంద్రరావు..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం పర్యవేక్షణలో నడుస్తున్న శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ చైర్మన్‌గా రాఘవేంద్రరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించనుంది. చైర్మన్‌తో పాటు బోర్డును సైతం ప్రకటించనుంది. పార్టీ అధికారంలో లేనపుడు ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు ఆర్థికంగానూ, సాంస్కృతికంగానూ సహాయ సహకారాలు అందించిన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 2014-2019 మధ్య టిడిపి అధికారంలో ఉన్నపుడు సైతం నాలుగేళ్లపాటు రాఘవేంద్రరావు ఎస్వీబీసీ చైర్మన్‌గా ఉన్నారు.



రెచ్చిపోతున్న మానవమృగాలు

ఇంటర్ విద్యార్థినిపై అత్యాచారం
అవమానంతో ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - గూడూరు

దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి గ్రామ సరిహద్దులోని రైస్‌మిల్లు అడవి పొదల్లో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసిహత్య చేసిన ఘటన బుధవారం జరిగింది. ఈ ఘటన మరువకముందే గూడూరు పరిధిలోనే ఇంటర్ విద్యార్థి కాలేజీకి వెళ్లడానికి బయటకు రాగా రౌడీషీటర్ బలవంతంగా ఆటోలో తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో అవమానంగా భావించిన ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ప్రస్తుతం ఆ విద్యార్థిని నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలిలా ఉన్నాయి.

తిరుపతి జిల్లా గూడూరు రెండో పట్టణ పరిధిలో నివసించే బాలిక కాలేజీకి వెళ్లేందుకు ఇంటినుంచి బయటకు రాగానే గూడూరు పట్టణం అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ వినయ్ బాలికను కత్తితో బెదిరించి ఆటోలో కిడ్నాప్ చేశాడు. గాంధీనగర్ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసి, సాయంత్రం తిరిగి ఆటోలో రెండో పట్టణ పరిధిలో వదిలేసి వెళ్లిపోయాడు. అవమానంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు వైద్యం కోసం గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి, పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. రెండో పట్టణ పరిధిలో కేసు నమోదు అయ్యింది.

వినయ్‌ని కఠినంగా శిక్షిస్తాం : డిఎస్‌పి

ఇంటర్మీడియట్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన రౌడీషీటర్ వినయ్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్లో మీడియాతో మాట్లాడారు. బాధితురాలు ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. గూడూరు ఒకటో పట్టణానికి చెందిన రౌడీషీటర్ వినయ్ ఆ విద్యార్థిని మూడేళ్లుగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసుల ద్వారా వార్నింగ్ ఇచ్చారు. అకస్మాత్తుగా వినయ్ ఆటో తీసుకొచ్చి విద్యార్థిని కత్తితో బెదిరించి గాంధీనగర్ ప్రాంతంలోని నిర్జీవ ప్రాంతంలో అత్యాచారానికి ఒడిగట్టాడు. అవమానభారంతో విద్యార్థిని ఇంట్లో ఉన్న హైజర్ అనే క్లీనర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో మానవహారం

ప్రజాశక్తి -ఏర్పేడు

ఏర్పేడు మండలంలోని మునగలపాలెం పంచాయతీ మూల కండ్రిగలో చిన్నారులపై అత్యాచారాలను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ, జైభారత్ సంస్థ సభ్యులు ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఏర్పేడు కూడలి వద్ద మానవహారాన్ని నిర్వహించారు. సిఐటియు నాయకులు షేక్ కరీముల్లా మాట్లాడుతూ మూలకండ్రిగలో జరిగిన ఘటన హేయమైనదన్నారు. నిందితుని కనీసం 14 ఏళ్లు కఠిన కారాగార శిక్ష పడేలా కేసులు పెట్టాలన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరగడం వల్లనే మానవమృగాలు పేట్రేగిపోతున్నాయన్నారు. గ్రామ సర్పంచులు గ్రామ కమిటీలను వేసి నియంత్రించాలని కోరారు. ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పేడు మండల కోఆర్డినేటర్ గుండ్లపల్లి శిరీష మాట్లాడుతూ ఇంతకుముందు ఏర్పేడు మండలంలోనే బాలికపై అత్యాచారం చేసి, జైలుకు వెళ్లి కూడా మళ్లీ ఇంకో బాలికపై అత్యాచారం చేశాడన్నారు. మూలకండ్రిగలో అత్యాచారం చేసిన బలరామయ్య గౌడ్ అనే మానవమృగాన్ని ఉరితీయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, రంగయ్య, వెంకటేశ్వర్లు, రాంబాబు, పాండురంగమ్మ, భాగ్యలక్ష్మి, ధనమ్మ పాల్గొన్నారు.



చిన్నారులపై మానవమృగాల అకృత్యాలు నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ..

విఎస్‌యు ఇన్‌ఛార్జి వీసీగా విజయభాస్కర్‌రావు

ప్రజాశక్తి - క్యాంపస్




నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి ఇన్చార్జి ఉపకులపతిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విభాగపు సీనియర్ ఆచార్యులు, యూజీసీ అకడమిక్ రీసెర్చ్ డీన్, డీఎస్టి పర్స్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఎస్ విజయభాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మండలి నుంచి ఉత్తర్వులు అందాయి. శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి ఛాంబర్ లో ఇంచార్జ్ ఉపకులపతిగా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ఆచార్య ఎస్ విజయభాస్కరరావు 'ప్రజాశక్తి'కి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివద్ధికి బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థుల అందరి సహకారంతో తన వంతు కషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎస్వీయూలోని భౌతిక శాస్త్రం విభాగంలోని ఆయన చాంబర్లో పలువురు ఎస్వీయూ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, విద్యార్థులు పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువలతో శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్వీయూలో ఆచార్య సిహెచ్ అప్పారావు



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఇన్చార్జి ఉపకులపతిగా ఆచార్య సిహెచ్ అప్పారావును నియమించారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మండలి ఉత్తర్వులను జారీ చేసింది. శ్రీ వేంకటేశ విశ్వవిద్యాలయంలోని బయోటెక్నాలజీ విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు, ఎస్వీయూ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్. అప్పారావు నూతన ఇంచార్జ్ ఉపకులపతిగా నియమితులయ్యారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఉప కులపతి చాంబర్లో బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మహిళా వర్సిటీకి ఆచార్య వి.ఉమ



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నూతన ఇంచార్జ్ ఉపకులపతిగా ఆచార్య వి.ఉమ నియమితులయ్యారు. ఆమె గతంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆచార్య దుర్గాభవాని ఉపకులపతిగా ఉన్నప్పుడు విశ్వవిద్యాలయం మొట్టమొదటి రెక్టార్‌గా సమర్థవంతంగా విధులను నిర్వహించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ రవీంద్రబాబు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా...ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.

'అన్నదానం' కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో విధులు నిర్వహించే ఎఫ్ఎంఎస్ కార్మికులు గత రెండు నెలలుగా జీతాలు అందలేదని గురువారం నిరసన తెలిపి టీటీడీ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత కార్మికులతో జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ సిబ్బంది జీతాలు సదరు బ్యాంకు ద్వారా వారి కాంట్రాక్టర్ కు గత వారమే పంపామన్నారు. ఇప్పటికే మొదటి బ్యాచ్ కార్మికుల జీతాలు పంపడం జరిగిందని, ఈరోజు రెండవ బ్యాచ్ కార్మికుల జీతాలు వారి అకౌంట్లలో వేశామన్నారు. అన్న ప్రసాదం కార్మికులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తమ విధుల విరామ సమయంలోనే అధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం వారు యధావిధిగా తమ విధులకు హాజరయ్యారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి -తిరుమల



బెంగుళూరుకు చెందిన ఏబియం ఇన్ఫ్రాటెక్ అధినేత ఎస్.ఎన్.బ్యాటేగౌడ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో టీటీడీ ఈవో జె.శ్యామల రావుకు ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని పాల్గొన్నారు.

22న మన్నవరంపై సిఎంతో భేటి

పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష
ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నియోజకవర్గం పరిధిలో పెండింగ్లో ఉన్న అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి కత నిశ్చయంతో ఉన్నానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. 22న మన్నవరంపై సిఎంతో భేటీకానున్నట్లు చెప్పారు. ఈ మేరకు సవరించిన అంచనాల బడ్జెట్, డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్టులను తయారుచేసి ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. స్థానిక పిఆర్ అతిథిగహంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గురువారం ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తదనంతరం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీకాళహస్తికి ప్రాణాధారంగా ఉన్న తెలుగు గంగ, ఎస్ఎస్ కెనాల్, మల్లిమడుగు, బాలాజీ రిజర్వాయర్ ప్రాజెక్టుల పూర్తికి ఏమి అడ్డంకులు ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే సవరించిన అంచనాలతో బడ్జెట్ మంజూరు చేసి ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రాయలసీమ జిల్లాలకే తలమానికంగా నిలిచిన మన్నవరం బెల్ పరిశ్రమకు పునర్జీవం పోసేందుకు సర్వ శక్తులు ఒడ్డుతానని అన్నారు. ఈనెల 22న సీఎం చంద్రబాబుతో భేటీలో మన్నవరం తో పాటు ఇరిగేషన్ ప్రాజెక్టుల అంశాలను కూడా తీసుకొచ్చి అడ్డంకులు తొలగించేందుకు కషి చేస్తానని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఐటీ సెక్టార్ అభివద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామనీ, త్వరలోనే ఐటీ కంపెనీలు శ్రీకాళహస్తికి రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల రహిత పట్టణంగా శ్రీకాళహస్తిని తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామనీ, శ్రీకాళహస్తిలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న 'ఏ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే ఓ ముస్లిం మైనార్టీ నాయకుడికి జైలు తప్పదని హెచ్చరించారు. ముక్కంటి ఆలయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల నివేదికను వారం రోజుల్లో మీడియా ముందు ఉంచుతానని చెప్పారు. అవినీతికి పాల్పడ్డ వ్యక్తులను జైలుకు పంపుతానని హెచ్చరించారు.

ప్రభుత్వ వసతిగృహాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి :కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రభుత్వ వసతిగృహాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సొంత పిల్లల పట్ల ఎంత బాధ్యతగా ఉంటారో, అంతకన్నా ఎక్కువగా వారిని చూసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. ఆగస్టు 10కల్లా జిల్లా సంక్షేమ శాఖ అధికారులు హాస్టళ్లను, గురుకులాలను సందర్శించి, వాటిని మెరుగుపరచడానికి పూర్తిస్థాయిలో నివేదికలు, అంచనాలు తయారుచేసి సమర్పించాలన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎటువంటి చిన్నపొరబాటు జరగడానికి వీల్లేదన్నారు. ఈ సమావేశంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, రాజ్యలక్ష్మి, డిసిఒ పద్మజ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ గోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేకం

తిరుపతి సిటి : తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో గురువారం స్వామివారికి కవచ సమర్పణతో జ్యేష్ఠాభిషేకం శాస్త్రోక్తంగా ముగిసింది. సాయంత్రం ఉభయనాంచారులతో కలసి స్వామివారు ఆలయ ప్రధాన వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో ముని కష్ణారెడ్డి పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో మున్సిపల్ మార్కెట్ వేలం పాటలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మున్సిపల్ కార్పొరేషన్ కూరగాయల మార్కెట్, పార్కింగ్ ఫీజులు వసూలు చేసే వాటికి గురువారం వేలం పాటలు కమిషనర్ అదితి సింగ్, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ సమక్షంలో టెండర్లను పిలిచారు. ఇందులో రికార్డు స్థాయిలో ఇందిర ప్రియదర్శని కూరగాయల మార్కెట్ ఎనిమిది నెలలకు గాను మూడు కోట్ల 21 లక్షల రూపాయలను గీతా అనే కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. మొత్తం ఏడుగురు కాంట్రాక్టర్లు వేలంపాటలకు హాజరు కాగా హోరాహోరీగా కాంట్రాక్టర్లు వేలం పాట పాడి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ ను దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో టిడిపి పార్టీకి చెందిన వారే మూడు వర్గాలుగా చీలిపోయి టెండర్ను దక్కించుకున్నారు. గత ఏడాది ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ రెండు కోట్ల 59 లక్షల రూపాయలు పాట పాడి ఏడాదికి దక్కించుకోగా, ఈసారి ఎనిమిది నెలలకు మూడు కోట్ల 21 లక్షలు కార్పొరేషన్ ఖజానాకు రావడం విశేషం. అయితే సీల్డ్ కవర్లో పిలిచిన టెండర్లు కేవలం ఎక్కువ శాతం కోడ్ చేసింది రెండు కోట్ల 59 లక్షల 600 రూపాయలు ఉండడం విశేషం. తర్వాత గాంధీ రోడ్డు, దేవేంద్ర థియేటర్, మాస్క్ రోడ్డు, ఇస్కాన్ రోడ్డు, కపిల్ తీర్థం రోడ్డు, త్యాగరాజమండపం వద్ద వాహనాల పార్కింగ్ టెండర్లు పిలిచారు, ఇందులో సర్కారు వారి పాట 8,92,000 తో ప్రారంభించారు. ఇందులో ప్రభాకర్ నాయుడు 12 లక్షల 62వేలకు పాట దక్కించుకోగా సీల్డ్ కవర్లో వేసిన టెండర్లు ప్రకాష్ అనే కాంట్రాక్టర్ 13 లక్షల 5వేలకు దక్కించుకున్నారు. భారతి బస్టాండు వేలం పాట శరత్ అనే కాంట్రాక్టర్ ఏడు లక్షల 50 వేలు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే జి ఎస్ మాడావీధి పార్కింగ్ టెండర్లు పిలవుగా కాంట్రాక్టర్లు ఎవరు ఓపెన్ టెండర్ లో పాల్గొనలేదు. సీల్డ్ టెండర్లు ద్వారా వచ్చిన వాటిని పరిశీలించగా ముని కష్ణారెడ్డి అనే కాంట్రాక్టర్ 93 వేల 300 రూపాయలు దక్కించుకున్నారు. గురువారం నిర్వహించిన వేలం పాటలో అధికార పార్టీ కాంట్రాక్టర్లు ఎక్కువమంది పోటీ పడటం గమనార్హం. భారీబందోబస్తు మధ్య వేలం పాట ప్రశాంతంగా జరిగింది. కార్పొరేషన్ ఆదాయం బాగానే పెరిగింది.



మార్కెట్, పార్కింగ్‌స్థలాలకు వేలం పాటలో పెద్దఎత్తున కాంట్రాక్టర్లు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణ సమీపంలోని మధురెడ్డి కాలనీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లును పంపిణీ చేశారు. గురువారం ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సీనియర్ ఆడిటర్ కంటి రామ్మోహన్ రావు తల్లి శుభరత్నమ్మ జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గోపాల్ రెడ్డి, నాగులు, గిరిబాబు, ధనుంజయ రెడ్డి, సనత్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, వాసు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించండి

- ఏపీవో భానుప్రియ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఏపీవో భానుప్రియ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. గురువారం బుచ్చినాయుడు కండ్రిగలో ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. ఎక్కువ మంది కూలీలకు సంఖ్య పెంచాలని సూచించారు. పనులు వద్ద తాగు నీరు, మెడికల్ కిట్లును అందుబాటులో ఉంచాలన్నారు. పనులకు సంబంధించి ఫొటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు.

రాయితీపై నిత్యావసరాలు

- తహశీల్దార్ ఉషారాణి



నిత్యావసరాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-రామచంద్రాపురం: ప్రజలకు రాయితీపై నిత్యావసరాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తహశీల్దార్ ఉషారాణి అన్నారు. గురువారం మండలంలోని సి.రామాపురం ప్రధాన రోడ్డుపై ఉన్న ప్రొవిజన్ షాప్, సూపర్ మార్కెట్‌లో రాయితీపై అందిస్తున్న కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నాణ్యమైన కందిపప్పు రూ.160, బియ్యం రూ.48, మరో రకం రూ.49లకు దుకాణాల్లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ గంగయ్య, ఆర్ఐ కృష్ణమ్మ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, వీఆర్‌వో ఝాన్సి రాణి, టీడీపీ నాయకులు రామిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రవి పాల్గొన్నారు.

బాలాయపల్లి: ఆహారం, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు అందిస్తున్నట్లు తహశీల్దార్ పుల్లారావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పౌరసరఫరాల ఆధ్వర్యంలో దుకాణం ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయి మస్తాన్ నాయుడు, సత్యం నాయుడు, కోటేశ్వరరావు, శేషమ నాయుడు, బాలాయపల్లి, సర్పంచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత చొరవ.. చేతి బోర్లకు మరమ్మతులు



చేతి బోర్లు మరమ్మతులు చేయిస్తున్న ధనపాల్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని పదో వారులో చేతి బోర్లు మరమ్మతులకు గురైయ్యాయి. ప్రజా అవసరాల కోసం ఉపయోగపడే బోర్లు అందుబాటులో లేకపోవడంతో స్థానికులు అక్కడి టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ డిజి ధనపాల్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వెనువెంటనే చొరవ తీసుకున్న ఆయన రెండు చేతి బోర్లుకు గురువారం మరమ్మతులు చేయించారు. దీంతో అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

'రైతులకు నష్ట పరిహారం ఇవ్వండి'

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని రేణిగుంట విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయిన వికృతమాల రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పలువురు నాయకులు గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్లుకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ కలిసిన వారిలో మాజీ సర్పంచ్ పూల హేమాక్షి, జెడ్పీటీసీ డాక్టర్ తిరుమలయ్య, నాయకులు మునిరత్నం యాదవ్, మద్దిల చలపతి, మణి, ఢిల్లిబాబు ఉన్నారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన

ప్రజాశక్తి-కోట: మండలంలోని గూడలి మెయిన్, గూడలి పరిధిలో వచ్చే తిన్నెలపూడి చల్ల కాలువ, కొత్తపాలెం, పుచ్చలపల్లి గ్రామాల వద్ద ఇసుక రిచ్‌లను స్థానిక తహశీల్దార నాగరాజరావు ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు వారు తెలిపారు. ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా, మండల సర్వేయర్ రాంకుమార్, వీఆర్వోలు కృష్ణ, శ్రీనివాసులు, మైనింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'సకాలంలో రుణాలు తిరిగి చెల్లించాలి'

ప్రజాశక్తి-కోట: పొదుపు రుణాలను సకాలంలో చెల్లించాలని వైఎస్సార్ క్రాంతి పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రత్నయ్య అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీ, వివోఏలతో సమీక్షించారు. సమావేశంలో రత్నయ్య మాట్లాడుతూ పొదుపు సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకున్న శ్రీనిధి, ఉన్నతి లోన్లను సకాలంలో బ్యాంకుల్లో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు భాస్కర్, ప్రసాద్, శంకరయ్య, కృష్ణమ్మ, కంప్యూటర్ ఆపరేటర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం: సీడీపీవో

ప్రజాశక్తి-వెంకటగిరి: మున్సిపాలిటీలోని బంగారు పేట హరిజనవాడలో సిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి సిడిపిఓ సంసద్ బేగం అంగన్వాడీ పరిధిలోని కిశోర బాలికల తల్లిదండ్రులు కిశోర్ బాలికలకు మైనర్ బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.డయేరియా వ్యాధుల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తిరుపతి ఆర్‌డిఓను విచారించిన సీఐడీ బృందం



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో వైసిపి ప్రభుత్వం హయాంలో భారీగా దొంగ ఓట్లు చేర్చారనే ఆరోపణలు ఉండడంతో సిఐడి బృందం గురువారం విచారణ చేపట్టింది. చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని ఫిర్యాదు మేరకు మూడు రోజులుగా సిఐడి డిఎస్‌పి పద్మలత విచారణ చేపడుతున్నారు. ఆర్డీవో కార్యాలయంలో రెండు రోజులుగా ఆర్డీవో నిశాంత్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో, ఎఒ, డిప్యూటీ తహశీల్దార్లను విచారించి వెళ్లారు. ఆర్‌డిఒ నిశాంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం కార్యాలయానికి రావడంతో సిఐడి బృందం విచారించి, కొన్ని ఫైళ్లకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌తో మాట్లాడి ఇస్తామని చెప్పి తీసుకెళ్లింది. అయితే పూర్తిస్థాయిలో వివరాలు ఇచ్చేందుకు ఆర్డీవో నిశాంత్‌రెడ్డి నిరాకరించినట్లు సమాచారం. ప్రత్యేకించి గూడూరు ఆర్డీవో మీసాల కిరణ్ కుమార్ ప్రమేయంపై ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి రూరల్ తహసిల్దారుగా పనిచేసిన ఆయన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డితో అంటకాగారనే ఆరోపణలున్నాయి. డిప్యూటీ కలెక్టర్గా పదోన్నతి వచ్చాక ప్రభుత్వ విప్ హోదాలో చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు. తర్వాత గూడూరు ఆర్డీవోగా నియమితులయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూనే వారంలో ఐదు రోజుల పాటు తిరుపతిలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో వున్న చెవిరెడ్డి వ్యక్తిగత కార్యాలయంలో మకాం వేసేవారని, చంద్రగిరి పరిధిలోని ఆరు మండలాల తహసిల్దార్లను, తిరుపతి ఆర్డీవోను అక్కడికి పిలిపించుకుని బోగస్ ఓటర్లను చేర్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సిఐడి డి.ఎస్.పి పద్మలత, సీఐ రామ కిషోర్, ఎస్ఐఐ మంజుల, సిబ్బంది మంగళవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. అయితే ఆ సమయానికి ఆర్డీవో నిశాంత్రెడ్డి కార్యాలయంలో లేరు. కార్యాలయ ఏవో, ఎన్నికల డీటీ లను విచారించిన సీఐడీ అధికారులు ఎన్నికలకు సంబంధించిన కొన్ని రికార్థులు స్వాధీనం చేసుకున్నారు.

తిరుపతి రాయల్ నగర్‌లో దారుణ ఘటన

- ఒకే కుటుంబంపై కత్తితో గుర్తు తెలియని వ్యక్తి దాడి
- వృద్ధురాలు అక్కడికక్కడే మృతి
- మరో బాలిక గొంతు కోసిన దుండగుడు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి రాయల్ నగర్‌లో గురువారం సాయంత్రం దారుణ ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబంపై గుర్తు తెలియని దుండగుడు కత్తితో దాడికి తెగబడ్డాడు. దాడిలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందగా మరో బాలిక నీతి గొంతు కోశాడు. అదే ఇంట్లో ఉంటున్న యువతి ప్రేరణపై దాడికి పాల్పడ్డాడు. కాగా ప్రస్తుతం బాలిక నీతి, యువతి ప్రేరణ పరిస్థితి విషమంగా ఉందని అక్కడి స్థానికులు తెలిపారు. వ్యాపారి కుటుంబ సభ్యులపై కత్తితో దాడి చేసి ద్విచక్ర వాహనంలో దుండగుడు పరారైనట్లు అక్కడి స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్పీ క్లూస్ టీంను రంగంలోకి దింపారు. దుండగులను పట్టుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు.

విద్యార్థుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించండి: డాక్టర్ చైతన్య

ప్రజాశక్తి-దొరవారిసత్రం: గురుకులంలోని విద్యార్థుల ఆరోగ్య విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలని దొరవారిసత్రం పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య సూచించారు. గురువారం వైద్య సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ఎంజెపి గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పంపిణీ చేస్తున్న మధ్యాహ్నం భోజన ఆహార పదార్థాలను నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. వంటగది, డార్మెటరీ, మరుగుదొడ్లు, పరిసరాలు పరీక్షించారు. లోటుపాట్లు తలెత్తకుండా, విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా మెనూ ప్రకారం అప్పుడే వండిన ఆహార పదార్థాలనే వడ్డించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వెనువెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. తాగునీరు, వంటకాలకు ఆర్‌వో వాటర్‌నే వాడాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో సిహెచ్‌వో సంపూర్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎం శ్రావణి, ఇన్‌ఛార్జ్ సుభాషిని, వార్డెన్ ఫరూక్, కళాశాల స్టాఫ్ నర్స్ మోనిష, రెడ్డమ్మలు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: యర్రావారిపాళ్యం మండలం కూరపర్తివారిపల్లి పంచాయతీ అవులయ్యగారిపల్లిలో గురువారం నిర్వహించిన క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. పింక్ బస్సు ద్వారా ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. 32మంది ఈ పరీక్షలు చేయించుకోగా అందులో 22మహిళలు, 10మంది పురుషులు ఉన్నారు. వారిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కి రెఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సౌమ్య, డాక్టర్ హరిత సిబ్బంది పాల్గొన్నారు.

తామరగుంటను అభివృద్ధి చేయాలి

- మంత్రికి ఎమ్మెల్యే వినతి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ఉన్న తామర గుంటను టీటీడీ ద్వారా అభివృద్ధి చేయాలని మంత్రి ఆనం నారాయణరెడ్డిని కలిసి నగిరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ వినతి పత్రం అందజేశారు. కావలసిన నిధులు మంజూరు చేసి తోడ్పడాలని కోరారు.

తీరిన విద్యుత్ సమస్య

గత మూడేళ్లుగా పరిష్కారం కాని విద్యుత్ సమస్యను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో పరిష్కారమైంది. కల్లూరు పంచాయతీ ఎల్లమ్మ ఆలయం వద్ద సరఫరా ఆగిపోయి ఇబ్బంది పడుతుండగా విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ఆయన పరిష్కారం చూపారని హర్షం వ్యక్తం చేశారు.

వాహన చట్టాలపై అవగాహన అవసరం

- ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: మోటార్ వెహికల్ యాక్ట్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో న్యాయశాఖ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని హెల్మెట్ వినియోగించడం వలన కలుగు ప్రయోజనాలను వివరిస్తూ గూడూరు న్యాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండో పట్టణ పరిధిలో ఉన్న కోర్టు భవనం వద్ద హెల్మెట్ ధరించాలి అనే నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ కోర్టు నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు సాగింది.కార్యక్రమంలో అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ లోకనాథం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి, న్యాయవాదులు, గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, రవాణాశాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి: జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్వేటినగరం రోడ్డు కూడలిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట మోహన్, ఎంఈవోలు తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం, హెచ్ఎం మునికృష్ణయ్య, బార్ అసోసియేషన్ కార్యదర్శి మురళి రెడ్డి, న్యాయవాదులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి: కిరణ్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏపీ ఒలంపిక్ సంఘం తమదంటూ క్రీడాకారులను, క్రీడా సంఘాలను మోసం చేస్తూ గతంలో ఆర్థిక అక్రమాలకు పాల్పడిన వెంకట్ నామిశెట్టి, ఆకుల వెంకట్ రాఘవేంద్ర రావులపై చర్యలు తీసుకోవాలని ఏపి జూడో సంఘం కోశాధికారి చీనేపల్లి కిరణ్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ జీరో సంఘం అధ్యక్షులుగా ఆనం రామకృష్ణారెడ్డిని గుర్తించిందన్నారు. అయితే వెంకట్ నామిశెట్టి, తానే జూడో సంఘం సీఈవోగా చెప్పుకుంటూ జిల్లా సంఘాలకు గుర్తింపు ఇస్తానని నమ్మబలికి లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ చేయాలని, క్రీడాకారులను మానసికంగా శారీరకంగా వేధిస్తూ వీరిపై నమోదైన కేసులను సత్వరం పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో చిత్తూరు జిల్లా త్రో బాల్ సంఘం కార్యదర్శి ఇ.కిరణ్, సభ్యులు ప్రదీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్ కుమార్

ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు

- తహశీల్దార్ మహమ్మద్ అలీ ఖాన్ హెచ్చరిక



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని మండల తహశీల్దార్ మహమ్మద్ అలీ ఖాన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని నెరిణి కండ్రిగ పంచాయతీ కాంచన పెత్తూరు గ్రామ లెక్క సర్వే నెంబర్లు 461, 462, 463 464లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిలో సర్పంచ్ చంద్రశేఖర్, వీఆర్‌వో వెంకటేష్ సమక్షంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కరకంబట్టు చెరువు ఆనుకుని ఉన్న భూములను గిరిజనుల బతుకుదెరువు కోసం ప్రభుత్వం గతంలో పట్టాలు మంజూరు చేసారని తెలిపారు. అయితే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గిరిజనుల భూములను తమ వశం చేసుకోవడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. దీనిపై హైకోర్టులో కూడా వ్యాజ్యం నడుస్తోందని, ఈ ఆక్రమణల వల్ల కరకంబట్టు గ్రామంలోని 250ఎకరాల ఆయకట్టు ఉన్న పంట పొలాలకు నీరు అందక తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ మునగ పట్టాలను రద్దు పరిచి గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు సుధాకర్ నాయుడు, కన్నయ్య నాయుడు, గ్రామస్తులు మునెయ్య, శ్రీను, శ్రీనివాసులు, శేఖర్, వంశీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు వద్దు

ప్రజాశక్తి - పిచ్చాటూరు : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్లు) పై నూతనంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు రాజకీయంగా వేధింపులకు గురిచేస్తూ వారిని తొలగించాలని చూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎంఎల్ఎ ఆదిమూలంను పిచ్చాటూరులో కలిసారు. అధికార పార్టీ తమవారిని నియమించుకోవాలని గత 18 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించాలనుకోవడం దారుణమన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లలో ఎక్కువమంది దళితులు, వెనుకబడిన తరగతులవారు ఉన్నారని, పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

పంటలకు మద్దతు ధర కల్పించండి

రైతులు పండించిన పంటకు మద్దతు ధరకు చట్టం చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మండల కేంద్రమైన కేవీబీపురం సచివాలయంలో ఎస్‌కెఎం ఇచ్చిన పిలుపుమేరకు సచివాలయాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఇచ్చారు.రైతు భరోసా 20వేల రూపాయల పెట్టుబడి సాయం మంజూరు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించి, రోజుకు 600 వేతనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

మంచి నీళ్ల గుంటను పునరుద్ధరిస్తాం : ఆరణి



తిరుపతి టౌన్: కలుషితంగా మారిన మంచి నీళ్ల గుంటను పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. గురువారం ఉదయం మంచి నీళ్ళ గుంటను ఎన్డీఏ కూటమి నేతలతో పాటు జనసేన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పోరేటర్లతో కలిసి పరిశీలించారు. గోవిందరాజ స్వామి ఆలయానికి నిత్యం నీళ్లు తీసుకెళ్లే మంచినీళ్ళగుంట కలుషితానికి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల నుంచి వచ్చే మెడికల్ వేస్టేజ్ మున్సిపల్ డ్రైనేజీలో కలవ కుండా భూమిలో ఇంకిపోవడమే కారణమని కార్పోరేటర్ నరసింహాచ్చారి ఎమ్మెల్యేకు వివరించారు. మంచినీటిగుంట చుట్టూ కలుపు మొక్కలు పెరిగిపోవడంతోపాటు అపరిశుభ్రంగా ఉండటం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. యాభై వేల మందికి తాగునీరు అందించే మంచినీళ్ళగుంట పునుర్ధరణకు గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. రుయా, స్విమ్స్ మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ డ్రైనేజీ కాలువలో కలిపేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కలుషితనీరును శుద్ధి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలపారు. టిటిడి ఈఓ, కార్పోరేషన్ కమిషనర్లతో చర్చించి మంచినీళ్ళ గుంటను పునరుద్ధరిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు నరసింహ ఆచ్చారి, సికే రేవతి, కల్పనా యాదవ్, దుడ్డు శివ, టిడిపి నాయకులు మునికృష్ణ, కట్టా జయరామ్, నైనార్ శ్రీనివాస్, బిజెపి నాయకులు అజయ్ కుమార్, వంప్రసాద్, జనసేన నాయకులు వెంకటేశ్వర్లు, సికే రవి, యాదవకృష్ణ, ఆర్కాట్ క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు.

అపోలో డయాగ్నోస్టిక్స్ సెంటర్' ప్రారంభం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆధునిక ప్రాసెసింగ్ ల్యాబ్ 'అపోలో డయాగ్నోస్టిక్స్ సెంటర్'ను తిరుపతిలోని ఎన్జీవో కాలనీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి విదేశాల్లో వైద్యం చేస్తున్న సమయంలో అత్యున్నత వైద్య సేవలు భారత్‌లో అందజేయాలని ఆకాంక్షించారన్నారు. అపోలో హాస్పిటల్స్ ఈ రోజు దేశ, విదేశాలలో అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందజేస్తుందని చెప్పారు. తిరుపతిలో అపోలో డయాగ్నోస్టిక్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు. ఇది సరికొత్త సాంకేతికతతో సమగ్ర రోగ నిర్ధారణ సేవలను అందిస్తుందని తెలిపారు. అపోలో హెల్త్, లైఫ్‌స్టైల్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరామ్ అయ్యర్ మాట్లాడుతూ అపోలో డయాగ్నోస్టిక్స్.. అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ యూనిట్ ఐఎస్‌ఓ సర్టిఫికేషన్‌తో కూడిన పాథాలజీ ల్యాబ్ ఇదన్నారు. ఇది 140వ ప్రాసెసింగ్ ల్యాబ్ అన్నారు. తిరుపతిలో ఆరు పేషెంట్ కేర్ సెంటర్లు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్లో 115 సెంటర్లు కలవన్నారు. ఈ సందర్భంగా అపోలో డయాగ్నోస్టిక్స్ సీవోవో దేవేంద్ర సింగ్ రాజ్‌పుత్ పాల్గొన్నారు.

'జగనన్న కాలనీ'లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

తిరుపతి సిటీ : జగనన్న ఇండ్ల నిర్మాణాలు, భూసేకరణలో జరిగిన భారీ అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బిజెపి నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. విచారణ జరిపితే వైసిపి మంత్రులకు, ఎంఎల్ఎలకు, సహకరించిన జిల్లా రెవెన్యూ అధికారులకు జైలుశిక్ష తప్పదన్నారు. ఈ మేరకు సిఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. దాదాపు వంద కోట్లకు పైగా ప్రజాధనం లూటీ అయ్యిందని పేర్కొన్నారు. ఈ అక్రమ ఆస్తులను రికవరీ చేయాలన్నారు.

ప్రజా సేవకులన్నది మరువకూడదు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి): ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలని, ఆ తరువాత ప్రజా ప్రతినిధులుగా సేవకులమన్నది మరువకూడదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం చంద్రగిరి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షత జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో బాధ్యతాయుతంగా ఉండాలని విజ్ఞప్తించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. శాఖల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతలకు సహకరించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సమావేశంలో సీఐ రామయ్య అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిలకూరి యుగంధర్ రెడ్డి, తహశీల్దార్ మారుతి, ఎంపీడీవో వివి సూర్య సాయి, సుబ్రమణ్యం నాయుడు, గౌస్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డికి నివాళి



ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి సీనియర్ నాయకుడు చెలికం శంకర్ రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డిలు శంకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. అదేవిధంగా వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి శంకర్‌రెడ్డి భౌతికాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ స్వామి దాసుపై బెంగాల్‌కి చెందిన లల్తూ కలిండి అనే యువకుడు దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ కథనం మేరకు గూడూరు పట్టణంలోని సాధుపేట సెంటర్‌లో ఉన్న టీ దుకాణానికి టీ తాగేందుకు వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ దాసుపై బెంగాల్‌కు చెందిన విచిత్ర ప్రవర్తన కలిగిన లల్తూ కలిండి అనే యువకుడు వెనక నుండి కర్రపై దాడి చేయడం జరిగిందన్నారు. అనంతరం స్థానికుల సహాయంతో అతన్ని పట్టుకొని స్టేషన్‌కి తరలించారు. అనంతరం గాయపడిన కానిస్టేబుల్‌ను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్టేడియంను బలోపేతం చేస్తాం..

- గూడూరు ఆర్‌డీవో కిరణ్‌కుమార్



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని అల్లూరు ఆది శేషారెడ్డి స్టేడియంని బలోపేతం చేసేందుకు చర్యలు చేపడతామని గూడూరు ఆర్‌డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్టేడియంను పరిశీలించారు. అక్కడ క్రీడాకారులు, వా కర్స్ క్లబ్ సభ్యులతో మెరుగైన సౌకర్యాల కోసం చర్చించారు. మౌలిక వసతులు కల్పన, డ్రైనేజీ తదితర అంశాలను పరిశీలించి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అకౌంటు ద్వారా స్టేడియం బలోపేతానికి చర్యలు చేపడతామని ఆర్‌డీవో తెలిపారు. ఆ మేరకు నివేదికలు సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సభ్యత్వాన్ని మొదట స్వీకరించి జనసేన సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఎన్జీఒ కాలనీలోని తన నివాసంలో జనసేన సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈనెల 28వ తేదీ వరకు జనసేన క్రియాశీలక సభ్యత్వం కొనసాగనుంది. యాభై రెండు యూనిట్లుగా సభ్యత్వ నమోదును చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఒక్కో డివిజన్ లో రెండు వందల మంది క్రియాశీల సభ్యులు చేరేలా టార్గెట్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం పొందే వాళ్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కల్పించారని ఆయన చెప్పారు. గ్రూప్ ఇన్సూరెన్స్ వల్ల అనుకోని దుర్ఘటనల్లో కార్యకర్తలు చనిపోతే ఐదు లక్షలు, స్వల్ప గాయాలైతే యాభై వేలు వారి కుటుంబాలకు అందుతుందని ఆయన తెలిపారు. పదివేల మంది క్రియాశీల సభ్యులను చేర్చడం తమ ముందున్న లక్ష్యమని ఆయన చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, పొలకల మల్లిఖర్జున్, కిరణ్ రాయల్, రాజారెడ్డి, రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్: పట్టణంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మెరుపుల మహేష్ ఆధ్వర్యంలో జరిగింది. గురువారం పట్టణంలోకి పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.

పరిహారం అందించి రైతులను ఆదుకోండి



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: గతేడాధి తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల, ఆ తరువాత డిసెంబర్ నెలలో కురిసిన మిచౌంగ్ తుఫాన్ వల్ల రైతులు నష్టపోగా బీమా పరిహారాన్ని ఇంత వరకు జమచేయలేదని కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు గురువారం మండల తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నష్ట పరిహారానికి సంబందించి వెంటనే నిదులు విడుదల చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బాల గురవయ్య, రమణయ్య, తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా మొబైల్ ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి తిరుపతి సిటీ: తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులు ఆధ్వర్యంలో పదో విడతలో 90 లక్షలు విలువ గల 500 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో సెల్ ఫోను పోగొట్టుకున్న వారి కోసం ప్రత్యేకంగా తిరుపతి జిల్లా పోలీసు వారు ఏర్పాటు చేసిన మొబైల్ హంట్ (వాట్సాప్ 9490617873) అప్లికేషన్ సేవల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై గతంలో సుమారు రూ.5,45,40,000/- ల విలువ గల 9 విడతలలో 3,030 సెల్ ఫోన్ లను రికవరీ చేసి సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు అందజేశామన్నారు.

ప్రజా అవసరాలపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ప్రజా అవసరాలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం వరదయ్యపాళ్యం మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ అధికారులు ప్రజా అవసరాలను తీర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రసాద్, తహశీల్దార్ ఉదయభారతి, సీఐ దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం: ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): పేద ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తున్నదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) అన్నారు. గురువారం చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో పోస్ట్ మార్టం గదిని ఆయన ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకి హాస్పిటల్స్ సుపరిండెంట్ డాక్టర్ అరుణ, వైద్యులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆ తర్వాత పోస్టుమార్టం గదిని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. చంద్రగిరికి రెండు వైపులా జాతీయ రహదారులు విస్తరించి ఉండటంతో ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. మృతుల భౌతిక కాయాలు పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి వైద్య కళాశాలకు తరలించే పరిస్థితి ఉండేది. మృతులు ఎక్కువగా ఉంటే పోస్ట్ మార్టం ఆలస్యం అయ్యేది. ప్రమాదాల బాధితులు ఎన్నో బాధలను పడుతుండేవారు. చిన్న పాటి గొడవలైన, ప్రమాదాలైనా మెడికో లీగల్ సర్టిఫికెట్లు పొందాలంటే తిరుపతి రుయా ఆస్పత్రికి పోవాల్సిందే. గత ఆరు సంవత్సరాలుగా ఇక్కడి ప్రజల అగచాట్లను చూసిన నేటి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఉన్నతాధికారులతో చర్చించి నిరుపయోగంగా ఉన్న పోస్టుమార్టం గదిని వినియోగంలోకి తీసుకురావడానికి చేసిన కృషి ఫలించింది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భౌతిక కాయాలను తరలించేందుకు ఎంపీ నిధులతో అంబులెన్స్ వాహనం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీంతో బాధితులకు ఆర్థిక భారం తగ్గటమే కాక సమయాభావం కూడా తగ్గనున్నది. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, కీర్తి, స్వర్ణలత ఠాగూర్, పవన్, సుష్మ, హేమంత్, శశ్రీ, హెడ్ నర్స్ కళావతి, నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నూతన పోస్టుమార్టం గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే